# చదువులా? చావులా?

పోయినసారి ఇండియా వెళ్ళినప్పుడు, మేమందరం మాట్లాడుకుంటుంటే అవేమీ పట్టించుకోకుండా తన హోం వర్క్ చేసుకుంటున్నాడు ఎనిమిదేళ్ళ గౌతమ్. గౌతమ్‌కి అప్పుడే పరీక్షలు మొదలయాయి. కానీ వాడు చదువుతున్న తీరే నాకు ఆశ్చర్యం కలిగించింది. పుస్తకంలో ఒక లైను చదివి, కళ్ళు మూసుకుని మళ్ళీ దాన్నే నాలుగైదుసార్లు అంటున్నాడు. అదవగానే మరో లైను. అలా దాదాపు రెండు గంటలు చదువుతూనే వున్నాడు. అంటే బట్టీ వేస్తున్నాడన్న మాట. మరి అదేమిటో అర్థం చేసుకుంటున్నాడా? బహుశా కాకపోవచ్చు.

వాడిననీ ప్రయోజనం లేదు. మన చదువుల పద్ధతే అలా వుంది. నాకూ ఇంజనీరింగ్ చదివేటప్పుడు ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో నూటికి తొంభై పైనే వచ్చాయి మార్కులు. కానీ ఏమిటి ప్రయోజనం. కారు దగ్గరికి తీసుకువెళ్ళి దాంట్లో ట్రాన్స్‌మిషన్ ఎక్కడుంది అంటే ఆకాశంలో అరుంధతి నక్షత్రం చూపించేవాడిని. కానీ అది టెక్స్ట్ బుక్‌లో ఎన్నో పేజీలో వుందో అర్థరాత్రి నిద్రలో అడిగినా ఠక్కున చెప్పగలిగేవాడిని. మరి ఈ తరం వాళ్ళకి నాలాటి వాళ్ళే కదా దారి చూపింది. మరి ఆనాటి నాలాటి వాళ్ళకి... ? గురజాడగారి గిరీశం 'ఏంవాయ్ వెంకటేశం! ఏమేం భట్టీయం వేశావోయ్' అనేవాడు. బహుశా అతనేనేమో తెలుగువాళ్ళందరికీ ఆదర్శం.

1986లో ఆర్.కె.నారాయణ్‌గారు ఆస్టిన్ వచ్చి నెలరోజులున్నారు. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో కొన్ని లెక్చర్లు ఇచ్చారు. ఆయన మనవడు కాబోలు ఇక్కడే వుండేవాడప్పుడు. నా శ్రీమతికి ఆయన రచనలంటే విపరీతమైన అభిమానం. నా సంగతి సరే సరి. సరే అంతకన్నా అదృష్టమేముంటుంది మరి. మేమిద్దరం మేఘాల మీద తేలిపోయాం. మూడు రోజులకోసారి ఆయన్ని కలవటం, సాహిత్యం గురించీ దేశంగురించీ మాట్లడుకోవటం. అంతకుముందు రాజ్యసభ సభ్యుడిగా ఆయన మన రేపటి పౌరులు ఎన్ని కేజీల పుస్తకాలు మోస్తున్నారో, వాటిలో ఎన్ని మిల్లీగ్రాముల చదువు అబ్బుతున్నదో వ్రాసింది చదివి, అదే హిందూ న్యూస్ పేపర్లో నా స్పందన వ్రాశాను. అది ఆయనకి చూపించి, హనుమంతుడి ముందు కుప్పిగంతులు కూడా వేశాను. ఆ విషయం గురించి మాట్లాడుకున్నాం. ఆయన ఆవేదన చదువుకున్న వారికే అర్థమవుతుంది. మన రాజకీయనాయకులకి అర్థం కాకపోవటంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు మరి.

అమెరికాలో చదువుల పద్ధతి చూశాక ఎన్నోసార్లు అనుకున్నాను, వీళ్ళలా మన చదువులు ఎందుకు లేవని? చదువుకున్న ప్రతివారూ పెద్ద పెద్ద సైంటిస్టులూ నోబుల్ ప్రైజ్ విజేతలు అవరు. కానఖ్ఖర్లేదు కూడాను. అందుకనే ఇక్కడ చదువుల్లో ఎంతో వైవిధ్యంవుంది. ఉద్యోగాలకి పనికి వచ్చే చదువులు ఎన్నో రకాలు. హైస్కూలు నించే రకరకాల దిశలు పోతుంది. ఆటోమొబైల్ మెకానిక్ అవాలనుకుంటాడు ఒకడు. ఫార్మసిస్టు అవుతుంది ఒక అమ్మాయి. గవర్నమెంట్ గురించి చదువుకుని,

వాషింగ్టన్‌లో ఉద్యోగం వెతుక్కుంటాడు ఇంకొకడు. జర్నలిజం చదువుకుని టీవీ బ్రాడ్‌కాస్టింగ్‌లో ఉద్యోగం వెతుక్కుంటుందొక పిల్ల. వీళ్ళందరూ ఆ ఉద్యోగాలకి అనవసరమైన నూట పదహారు సబ్జెక్టులు చదవనఖ్ఖర్లేదు.

మరి ఫండమెంటల్స్ అంటాడు అప్పారావు. 'ఓరి మెంటలూ! దేంట్లో ఫండమెంటల్సు. వాళ్ళేమీ షేక్స్‌పియరూ మిల్టనూ చదవఖ్ఖర్లేదు. రేపు ఉద్యోగాల్లో తెల్లముఖాలు వేయకుండా అవసరమైనవన్నీ నేర్చుకుంటున్నారు. హాండ్స్ ఆన్. అంటే బుర్రే కాదు, చేతులు కూడా వేసి అని అర్థం' అన్నాను.

అలాకాక ఏ డాక్టరేటో అవాలనుకునేవారికి, సబ్జక్టులని క్షుణ్ణంగా చదువుకునే అవకాశాలున్నాయి. అందుకేనేమో ఏటేటా వీళ్ళకి ఎన్నెన్నో నోబుల్ బహుమతులు.

మనలో చక్కగా అర్థమయేలా చదువు చెప్పే పంతుళ్ళే లేరా అనేది ఇంకో ప్రశ్న. ఇక్కడే మనకి ఎంతో ఆశ్చర్యం కలిగించే సమాధానం వస్తుంది. అమెరికాలో యూనివర్సిటీలలో మన లెక్చరర్లకి ప్రొఫెసర్లకీ ఎంతో మంచి పేరుంది, పాఠాలు చాల బాగా చెబుతారని. ఇండియాలోకూడా ఈరోజుల్లో ఎంతమందికి చదువు చెప్పటం వచ్చునో నాకు తెలీదు కానీ, మా రోజుల్లో కొంతమంది పాఠాలు చెప్పటంలో ఎన్నో కొత్త కొత్త పద్ధతుల్లో చక్కగా చెప్పేవారు. కొన్ని ఉదాహరణలు ఇస్తాను.

గుంటూరు హిందూ కాలేజీలో మా ఫిజిక్స్ లెక్చరర్ ఆ రోజుల్లో చెప్పినవి నాకు ఈనాటికీ గుర్తున్నాయి. ఫిజిక్స్‌లో కండక్షన్, కన్వెక్షన్, రేడియేషన్‌లని అర్థం చేసుకోవటం కొంచెం కష్టమే. దానికి ఆయన ఒక ఉదాహరణ చెప్పారు. ఒక చోట ఇల్లు కడుతున్నారుట. ఎన్నో ఇటుకలు ఒక పక్కనించీ ఇంకోపక్కకి తీసుకువెళ్ళాలి. వాటిని మూడు రకలుగా తీసుకువెళ్ళొచ్చు. ఒకటి పనివాళ్ళందరూ ఒకళ్ళ పక్కన ఒకళ్ళు నుంచుని, ఒక్కొక్క ఇటుకనీ అందించుకుంటూ ఇక్కడినించీ అక్కడికి తీసుకువెళ్ళటం. అంటే హీట్ ట్రాన్స్‌ఫర్‌లో కండక్షన్‌లా అన్నమాట. రెండవది ఒక్కొక్కళ్ళే ఒక్కొక్క ఇటుకనీ ఇట్నించీ అటు తీసుకువెళ్ళటం. అంటే కన్వెక్షన్. మూడవది ఒకడు ఇక్కడినించీ విసిరేస్తుంటే, ఇంకొకడు అక్కడ సచిన్ తెండూల్కర్‌లా అందుకుంటుంటాడు. అదే రేడియేషన్. ఇలా నలభై ఏళ్ళ క్రితం ఆ మహానుభావుడు చెప్పింది ఈనాడే కాదు, ఏనాటికీ మరిచిపోలేను. అలాగే ఆయన న్యూటన్స్ గ్రావిటేషన్ సూత్రాల గురించి చెప్పింది కూడాను. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంటుందిట, ఎవడో వచ్చి దాన్ని కదిలిస్తే తప్ప. పడితే క్రిందనే పడతావు, పైకి పడవు అనేవాడు. పడవ అటు పోవాలంటే ఇటు అంతే బలం పెట్టి తోయవూ, అదే మరి న్యూటన్ మూడో సూత్రం అనేవాడు. అలాగే మాకు తెలుగు చెప్పిన ఆయన. ఆయన నేర్పిన యమతారాజభానసలగం, మసజసతతగ, సభరనమయవ ఇంజనీరు నయినా, చదివి యుగాలు గడిచినా అవి ఇంకా ఇంకిపోలేదు. కానీ ఒకటి మాత్రం నిజం. ఈ మహానుభావులు ఎందరో లేరు. వేళ్ళ మీద లెఖ్ఖపెట్టొచ్చు.

పోయినసారి భారతదేశం వెళ్ళినప్పుడు, ముళ్ళపూడి వెంకటరమణగారినీ, బాపూగారినీ కలిశాను మద్రాసులో. నేను శెలవు తీసుకోబోతుండగా రమణగారు అడిగారు నామిని సుబ్రమణ్యం నాయుడిగారి చదువులా చావులా పుస్తకం చదివారా

అని. నాలుగేళ్ళ కొకసారి ఇండియాకి వెళ్ళినప్పుడు సూట్‌కేసెడు పుస్తకాలు తెచ్చుకోవటమే కానీ, మధ్యలో వచ్చిన ఎన్నో చక్కటి పుస్తకాలు అందుబాటులో లేకపోవటం వల్ల వెర్రిముఖం వేయవలసి వచ్చింది. ఆయన తన దగ్గర వున్న ఒక కాపీ ఇచ్చి, తప్పకుండా చదవవలసిన పుస్తకం. తీసుకు వెళ్ళండి అని ఇచ్చారు. మద్రాసునించీ గుంటూరు రైల్లో వచ్చేలోపునే చదివేశాను ఆ పుస్తకాన్ని. రాజకీయ కారణాల వల్ల ఒక పత్రికా సంపాదకుడిగా ఉద్యోగం వూడిపోతే, తమ స్వంత చిత్తూరు జిల్లాలో బడి పంతులు ఉద్యోగంలో చేరి, తన అనుభవాలని ఆవేదనతో వ్రాసిన పుస్తకం అది. తెగులు సినిమాలు విడవకుండా చూసే మన విక్రమార్కుల్లో ఎంత శాతం అంత చక్కటి పుస్తకాన్ని చదివారో చెప్పటం కష్టం. రాజకీయ నాయకుల సంగతి సరేసరి. వాళ్ళేగా మన చదువుల వర్తమానాన్నీ, భవిష్యత్తునీ భావి భారత పౌరుల నుదుటి మీద వ్రాసింది. వ్రాస్తున్నది. వ్రాయబోతున్నది. అందుకేగా చదువుల సరస్వతిని అమ్మకానికి పెట్టి లక్ష్మీదేవి పరం చేసింది.

ఇంతకుముందు ఈ ఎన్నారై కబుర్లలోనే వ్రాశాను. చదువుని వ్యాపారపరం చేసిన నాయకుల తమ ఖజానా నింపుకుని, మన యువతకి ఎంత అన్యాయం చేస్తున్నారో. మన తెలుగుదేశంలో 280 పైన వున్నాయిట ఇంజనీరింగ్ కళాశాలలు. వాటిల్లో కొన్ని అన్ని వసతులతోనూ, మంచి మాష్టర్లతోనూ పేరు సంపాదించాయి. అక్కడ చదువుకున్న విద్యార్థులు విజేతలు అవుతున్నారు. బాగుంది. కానీ మిగిలిన ఎన్నో అలాటి కళాశాలలు కలాశాలలు అయిపోయాయి. అవి పూరిగుడిసెల్లో గొడ్లశాలల్లో వెలిసిన వ్యాపారాశయాలు. లెక్చరర్లు, కనీసం కంప్యూటర్‌లూ లేని నిరాశా శాలలు. అక్కడ చాలమంది విద్యార్థులు క్లాసులకి రాకుండా హైదరాబాదులో డిగ్రీయార్థులై, అమెరికాకి వీసాయార్థులై దారి వెతుక్కుంటున్నారు. అంతేకాదు కట్నార్జితులై కొట్లార్జనతో అమెరికా వేపు చూస్తున్నారు. అలా వచ్చిన వాళ్ళు డిగ్రీ వున్నా సరుకు లేని కారణాన ఉద్యోగాలు రాక, చివరికి ఇండియన్ రెస్టారెంట్లలో సర్వారాయుళ్ళుగా మారిపోవాల్సి వస్తున్నది. కొంతమంది ఆత్మహత్యల పాలయిన వాళ్ళూ వున్నారు.

వాళ్ళల్లో కొంతమంది తెలివైన వాళ్ళు మాత్రం, ముందు ముందు లక్ష్మీ కటాక్షం కోసం, మళ్ళీ ఇక్కడ కాలేజీల్లో చేరి ముందుగా సరస్వతీ కటాక్షం కోసం శ్రమ పడుతున్నారు.

మరి ముందే అడ్డదారులు తొక్కి సంపాదించిన డిగ్రీలతో పాటూ, ఆ చదువుని కూడా ఆర్జిస్తే సరస్వతీ కటాక్షం వచ్చి వుండేది కదా. చదువులు డిగ్రీల కోసం కాకుండా ఉద్యోగం కోసమే అని చూసే అమెరికాలో అలాటివారికి ఏ సమస్యలూ వుండవు కదా!

చదువుల లక్ష్యం డిగ్రీలు కాదు. చావులు అసలే కాదు. జ్ఞాన సముపార్జన. ఉద్యోగ సంపాదన. మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకుని, ఉన్నత పదవులకి వెళ్ళటం. జీవితాన్ని సుఖవంతం చేసుకోవటం.

అదే అసలైన సరస్వతీ కటాక్షం.